ప్రజాశక్తి

గురువారం 26 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆరోపణలు.. ప్రత్యారోపణలు

- రెండో రోజూ జివిఎంసి కౌన్సిల్ రసాభాస
- విమర్శలకే పరిమితమైన టిడిపి కూటమి, వైసిపి కార్పొరేటర్లు
- 90పైచిలుకు అంశాలకుగాను 13పైనే చర్చ, 10 ఆమోదం, 3 వాయిదా
- నేడూ కొనసాగనున్న సమావేశం



కౌన్సిల్ సమావేశంలో ఘర్షణ పడుతున్న కూటమి, వైసిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఆరోపణలు, ప్రత్యారోపణలు.. విమర్శలు.. ప్రతి విమర్శలు.. వాదనలు.. వాగ్వాదాలు - జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో రెండో రోజూ అదే వరుస. మేయర్ టార్గెట్‌గానే కూటమి కార్పొరేటర్లు బుధవారమూ వ్యవహరించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ కౌన్సిల్ సుదీర్ఘంగా కొనసాగినా పెక్కు అంశాలపై చర్చ జరగలేదు. ఇన్‌కం ట్యాక్స్ సొమ్ము పక్కదారి పట్టించిన అధికారిని మంగళవారమే సస్పెండ్ చేశామని, అవినీతి ఆరోపణలపై రానున్న 15 రోజుల్లో విచారణ జరిపి, చర్యలు చేపడతామని కమిషనర్ సంపత్ కుమార్ హామీ ఇవ్వడంతో జీరో అవర్ నిర్వహించేందుకు సభ్యులు అంగీకరించారు.

ఈ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత సభ్యులు అందరికీ వార్డుల్లో సమస్యలను తెలియజేసేందుకు అవకాశం ఇస్తూ జీరో ఆవర్ కొనసాగింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సభ్యులందరూ మిగతా 2లో..

సమస్యలపై గళమెత్తిన సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు



సమస్యలను లేవనెత్తుతున్న గంగారావు

జీరో అవర్‌లో తమ ప్రాంత సమస్యలపై సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఎకో వైజాగ్ పేరిట ఏర్పాటు చేసిన వాహనాలు దుర్వినియోగం అవుతున్నాయని, కొంతమంది సభ్యులను ఏర్పాటు చేసుకొని వారికి ఒక డ్రెస్ కోడ్ ఏర్పాటు చేసి, వాళ్లతో గత కమిషనర్ జరిమానాలు వసూలు చేశారని, దానిపై విచారణ జరగాల్సిన అవసరముందని అన్నారు. తమ ఉక్కునగరం వార్డులో కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందని తెలిపారు. ప్రజల మిగతా 2లో..

వార్త మెయిన్, టాబ్లాయిడ్ 2లో..



సమ్మిట్‌లో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

రాష్ట్రాభివృద్ధికి రూట్ మ్యాప్

సిఐఐ ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ - 2024లో రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి లోకేష్

అనకాపల్లి ఎస్‌పిగా తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లా ఎస్‌పిగా తుహిన్ సిన్హాను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఎస్‌పిగా పనిచేసిన ఎం.దీపికను కాకినాడ ఎపిఎస్‌పి మూడో బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హా విశాఖపట్నం నగరంలోని లా అండ్ ఆర్డర్ డిసిపిగా పని చేస్తున్నారు. అంతకుముందు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పిగా పనిచేశారు. కాకినాడ ఎపిఎస్‌పి మూడో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీపై వెళ్తున్న ఎస్‌పి దీపిక జూలై 17న జిల్లా ఎస్‌పిగా విజయనగరం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆరోపణలు.. ప్రత్యారోపణలు

తమ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన సమస్యలను ప్రస్తావించారు. అన్ని వార్డులలో వీధి లైట్లు సమస్య ప్రధానంగా ఉన్నట్టు చర్చకు వచ్చింది. తాగునీరు, శ్మశాన వాటికల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌రీత్యా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల విషయాన్ని పలువురు కార్పొరేటర్లు లేవనెత్తారు. జివిఎంసి అధికారులు సకాలంలో స్పందించడం లేదని, అటువంటివారిపై కమిషనర్ చర్యలు చేపట్టాలని కోరారు, పారిశుధ్య కార్మికుల కొరత అధికంగా ఉందని, వారిని పెంచాలని, యుజిడి విభాగంలో రోడ్లను తవ్వి మరలా వాటిని పూర్తిగా పూడ్చటం లేదన్న అంశాలను సభ్యులు ప్రస్తావించారు. జీరో అవర్ తరువాత రాత్రి 8:35 గంటలకు 90 అంశాలపై సమావేశం ప్రారంభమైంది. సమావేశంలో భాగంగా అసభ్య పదజాలాన్ని ఉపయోగించిన వైసిపి కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్‌ను ఈ ఏడాది సభ నుంచి సస్పెండ్ చేశారు. జైలు రోడ్డులోని ఫుడ్ కోర్ట్‌లపై విచారణకు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మూర్తి యాదవ్‌ను క్రిమినల్ అని సంబోధించడంతో సభలో తీవ్ర వివాదం నెలకొంది. జివిఎంసి 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ మాట్లాడుతూ మాజీ కమిషనర్ సాయికాంత్ వర్మ తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారని, కౌన్సిల్ అనుమతి లేకుండా వెంకటేశ్వర మెట్ట ఎస్‌బిఐలో అకౌంటు ఓపెన్ చేసి ఫైన్లు పేరుతో అధికంగా నగదు డిపాజిట్లు చేయించారని, వీటిపై విచారణ జరిపించాల్సి ఉందని అన్నారు.

ఎట్టకేలకు చర్చ ఇలా..

48 అంశాలతో ప్రధాన అజెండా, 27 అంశాలతో సప్లిమెంటరీ అజెండా, 15 అంశాలకుపైగా టేబుల్ అజెండా వెరసి 90 పైచిలుకు అంశాలపై చర్చ జరగాల్సి ఉండగా ప్రధాన అజెండాలోని 13 అంశాలపైనే బుధవారం చర్చ జరిగింది. వాటిలో పదింటిని ఆమోదించారు. మూడు వాయిదా పడ్డాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సిల్ కొనసాగనుందని మేయర్ తెలిపారు.


సమస్యలపై గళమెత్తిన సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు

మధ్య అవి తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో ఈ విషయమై నిర్ణయం తీసుకున్నా కార్యరూపం దాల్చలేదన్నారు. అగనంపూడి టోల్‌ప్లాజాను తిరిగి ప్రారంభించేందుకు టెండర్లు పిలిచారని, దానిని పూర్తిగా తొలగించాలని కోరారు. జైల్ రోడ్డు ప్రాంతంలోని నైట్ ఫుడ్ కోర్టు ద్వారా తీవ్ర అవినీతి జరుగుతోందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జివిఎంసి అధికారులు విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉదాహరణగా 86వ వార్డులో కరోనాతో తల్లిదండ్రుల చనిపోతే ఒంటరి అమ్మాయి స్థలాన్ని ఒక వ్యక్తి కబ్జా చేశాడని, దానిపై ఆమె గత సంవత్సర కాలంగా జివిఎంసి చుట్టూ తిరుగుతున్నా ఆమెకు న్యాయం దక్కలేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అవినీతి పనులను ఆయన ప్రస్తావించారు.

అనకాపల్లి ఎస్‌పిగా తుహిన్ సిన్హా

నుంచి వచ్చారు.

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న 2011 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన కె.ఫకీరప్పను ఇంటిలిజెన్స్ ఎస్‌పిగా బదిలీ చేశారు.



అనకాపల్లి పట్టణంలో రైల్వే బ్రిడ్జి కింద చేరిన వర్షపునీరు

కాలువలేవీ ?

- అనకాపల్లి పట్టణంలో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ

- ప్రజల పాట్లు - సమస్యపై దృష్టి పెట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని గుండాల రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోయాయి. బైపాస్ రోడ్డు గుండా ప్రయాణికులు వెళ్లారు. పట్టణంలో మురుగునీటి కాలువ వ్యవస్థ సరిగాలేకపోవడంతో వర్షాలు పడిన ప్రతిసారీ ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. నీరు బయటకు పోయే మార్గాలు లేక పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరుతోంది. ఏ మాత్రం వర్షం పడినా అనకాపల్లి - తుమ్మపాల రోడ్డులోని రైల్వే బ్రిడ్జి కింద నీరు చేరుతోంది. ఆ సమయాల్లో రోడ్డు మార్గం గుండా వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడాల్సివస్తోంది. కొప్పాక వద్ద బుధవారం ఏలేరు కాలువ నీరు జాతీయ రహదారి పై నుంచి పారింది. దీంతో ఉదయం 10.30 గంటల వరకు అనకాపల్లి, విశాఖపట్నం జాతీయ రహదారిలో వాహనాలను పోలీసులు మళ్లించారు. రహదారి సాధారణ స్థితికి చేరుకొనే వరకు రెండువైపులా వెళ్లే వాహన రాకపోకలకు అంతరాయంలేకుండా ఒక రహదారిలో పంపించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. వరదనీరు పోయేలా మురికి కాలువలు లేకపోవడం, ఉన్న కాలువల నిర్వహణ లోపభూయిష్టంగా వుండడంతో వర్షం పడ్డ ప్రతిసారీ పట్టణ ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ లోపలకు వెళ్లే దారిలో బుధవారం నీరు చేరింది. జిల్లా కేంద్రం, జివిఎంసిలో అంతర్భాగంగా ఉన్న అనకాపల్లి పట్టణంలో మురుగునీటి కాలువలపై ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రాభివృద్ధికి రూట్ మ్యాప్

2047కు దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఎపి

దేశంలో ఐదో అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖను మారుస్తాం

ఐటి, డేటా సెంటర్స్, ఎఐ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- సిఐఐ ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ - 2024లో రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2047 నాటికి దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా ఎపిని అభివృద్ధి చేయడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఉత్తరాంధ్రను అతిపెద్ద ఫార్మాహబ్‌గా తీర్చిదిద్దుతామని, భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభమయ్యాక విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు విప్లవాత్మక అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. బుధవారం విశాఖలోని నోవటల్ హోటల్‌లో భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యాన జరిగిన ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్-2024 సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్అండ్‌బి, మౌలిక వసతులు, పెట్టుబడుల మంత్రి జనార్ధన్‌రెడ్డి, సిఐఐ ఎపి శాఖ ఛైర్మన్ వి.మురళీ కృష్ణ, జిఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ బిజినెస్ ఛైర్మన్ జిబిఎస్.రాజు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి పడ్డ 'బ్రేకర్ల'ను తొలగించనుందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ తమ విధానమని తెలిపారు. రాష్ట్రంలో ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఇడిబి)ను ఏర్పాటు చేసి శాఖల ప్రగతిని సమీక్షిస్తామని, సిఎం చంద్రబాబు పర్యవేక్షణలో ఇది నడుస్తుందని అన్నారు.

రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ప్రగతి సాధిస్తాం

అనంతపురం జిల్లాలో ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్, చిత్తూరు, కడప జిల్లాల్లో ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీస్, ప్రకాశం జిల్లాలో బయో ఫ్యూయల్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కేపిటల్ రీజియన్, గోదావరి జిల్లాలో ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని లోకేష్ అన్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. గోదావరి జిల్లాల్లో గ్రీన్ ఎనర్జీ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలోనే అతిపెద్ద పెట్రో కెమికల్ కారిడార్ గోదావరి ప్రాంతంలో రాబోతుందన్నారు. అలాగే రాబోయే ఐదేళ్లలో విద్యుత్ ఉత్పత్తి 72 గిగావాట్లు సాధించాలన్న లక్ష్యంతో హైడ్రో, విండ్, సోలార్ ప్రాజెక్టులను రాష్ట్రమంతటా నెలకొల్పుతామన్నారు.

విశాఖ అతిపెద్ద ఆర్థిక నగరం

దేశంలోని అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని, ఐటి, డేటా సెంటర్స్, ఎఐ రంగాల్లో విశాఖను గ్లోబల్ హబ్‌గా చేస్తామని పారిశ్రామిక వేత్తలనుద్దేశించి లోకేష్ ప్రసంగించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎయిర్ కనెక్టివిటీ ఏర్పాటుకు కృషి చేపట్టామన్నారు. దేశంలో అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా హైదరాబాద్ ఉండడంతో తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని, భోగాపురం వస్తే విశాఖ, ఎపి అభివృద్ధి అవుతాయని అన్నారు. విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్ పనులను త్వరితగతిన చేపడతామని, విశాఖలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు కానుందని అన్నారు.

రూ.17 వేల కోట్లతో పోర్టుల అభివృద్ధి: ఆర్అండ్‌బి మంత్రి జనార్ధన్‌రెడ్డి

రాష్ట్ర మంత్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రూ.17 వేల కోట్లతో పోర్టులను అభివృద్ధి చేస్తామన్నారు. పిపిపి మోడ్‌లో క్రిటికల్ ఇన్ ఫ్రా, హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టనున్నామన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ 18 నెలల్లో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఆర్థికాభివృద్ధిలో విశాఖ దేశంలో పదో నగరంగా ఉందని, ఎయిర్ కనెక్టివిటీ విషయంలో మాత్రం 27వ స్థానంలో ఉందని ఈ గ్యాప్‌ను సరిదిద్దుతామని అన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ ఎయిర్‌పోర్టులో ఎయిర్ కార్గో ప్రారంభమైందన్నారు. సమావేశంలో సిఐఐ విశాఖ జోన్ ఛైర్మన్ గ్రంధి రాజేష్, ప్రతినిధులు ఇ.శంకరరావు, వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు
కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితులకు విశాఖలోని అక్కయ్యపాలెంలో ఉన్న కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజ్‌మెంట్, సిబ్బంది కలిసి రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. సిబ్బంది ఒక్కరోజు జీతంతో పాటు డైరెక్టర్లు, బ్యాంకు కలిసి ఈ మొత్తాన్ని వరద బాధితుల సహాయార్థం సమకూర్చాయి. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బుధవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ అధ్యక్షులు, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, కార్యదర్శి సిహెచ్.రాఘవేంద్రరావులతో కలిసి బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు చెక్కును అందజేశారు. ఈ మేరకు కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు యాజమాన్యానికి, సిబ్బందికి సిఎం అభినందనలు తెలిపారు.

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయనగరంలో నవంబర్ 27 నుండి 30వ తారీకు వరకు జరుగనున్న ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

లడ్డుపై కూటమి అసత్య ప్రచారాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదంపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తోందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కూటమి అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ వైసిపి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్ల కండువాలు ధరించి బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి తప్పించుకోవడానికి ప్రజలను డైవర్ట్ చేయడానికి లడ్డు విషయమై అనవసర వివాదం రేపిందన్నారు.

జిఒ రేట్లు ప్రకారం జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ కార్మికులకు జిఒ రేట్లు ప్రకారం జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వడ్లపూడి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు మెయిన్ గేటు దగ్గర బుధవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ ధర్నా ఉద్దేశించి జగ్గునాయుడు మాట్లాడుతూ, రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 30వ తేదీన జివిఎంసి వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, అనేక దపాలుగా ఆందోళన చేస్తున్నా రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ యాజమాన్యం స్పందించడంలేదని, సమస్య పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, ఇస్తున్న జీతాలతో ఇప్పుడు పెరుగుతున్న నిత్యావసరాలను కొనలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జి రేటు ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ వర్కర్స్ ప్రెసిడెంట్ ఎ.అవతారం, కార్యదర్శి యువి.రాజు, వెంకటేశ్వరావు, వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.జగ్గునాయుడు, రాంబాబు తదితరులు

3లోగా ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ, జెడ్‌పి, మున్సిపల్, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాసే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు www.bse.ap.gov.inలో ఆగస్టు 5 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉన్నట్లు ఎంఇఒ ఎం.శివరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు నమోదుకు అక్టోబర్ 3వ తేదీకి పొడిగించినట్లు పేర్కొన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బిఐ కలెక్ట్ రసీదును డిఇఒ కార్యాలయంలో అక్టోబర్ 14వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. 8వ తరగతి చదువుతున్న, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు ఉన్న వారంతా ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డు ప్రకారం పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. పరీక్ష రాసే సమయానికి అవసరమైన అన్ని ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష రుసుము ఒసి, బిసి విద్యార్థులకు రూ.100, ఎస్సి, ఎస్టిలకు రూ.50 ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్ సైట్‌ను గానీ, డిఇఒ కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు తీర్పుపై హర్షం

ప్రజాశక్తి-ఆనందపురం : విశాఖ జిల్లా భీమిలిలోని ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలు తక్షణమే ఆపివేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. ఎర్రమట్టి దిబ్బలు ప్రకృతి సంపద అని, అటువంటి మధుర జ్ఞాపకాన్ని తవ్వకాలతో నాశనం పాడుస్తుంటే పర్యావరణ ప్రేమికులు హైకోర్టులో పిల్ వేశారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన తర్వాత తక్షణమే తవ్వకాలను నిలుపుదల చేయాలని నోటీసులు జారీ చేయడంపై సర్వత్ర ఆనందం వ్యక్తం అవుతుందని పేర్కొన్నారు.

లోకేష్‌ను కలిసిన కోరాడ

ప్రజాశక్తి- ఆనందపురం : విశాఖ వచ్చిన రాష్ట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను భీమిలి టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు.

ఎంపిడిఒను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం నూతన ఎంపిడిఒ డాక్టర్ జానకిని బుధవారం మండల జనసేన ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు బాలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ఉన్న డ్రైనేజీ, మంచినీరు, పాఠశాల భవనాల సమస్యలను ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 30వ తేదీన చేపట్టే మహాధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ కాంట్రాక్ట్ వర్కర్స్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూపార్కులో 20 సంవత్సరాల పైబడి పనిచేస్తున్న కార్మికుల జీతాలు అతి తక్కువగా ఉన్నాయన్నారు. కనీస వేతనాలు, వారాంతపు, పండగ సెలవులు లేవన్నారు. జూలో ప్రమాదాలు జరిగితే పట్టించుకునే నాథుడే లేరన్నారు. నిత్యవసర ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, వైద్యం ఖర్చులు, రవాణా చార్జీలు విపరీతంగా పెరిగినా జీతాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే ప్రభుత్వం కనీస వేతనంగా రూ.26 వేలు నిర్ణయించి అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి. నరేంద్రకుమార్, జూ పార్క్ యూనియన్ నాయకులు నరేష్, రాజు, నర్సింగరావు, పైడిరాజు, దిలీప్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు

ఆనందపురంలో జాయింట్ కలెక్టర్ పర్యటన


ఆక్రమణలో ఉన్న స్థలాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ బుధవారం పర్యటించారు. ఆనందపురం సర్వే నెంబర్ 276లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 2.40 సెంట్లు, జిల్లా సైనిక్ పోర్డుకు 50 సెంట్లు, ఎక్స్చేంజ్ కార్యాలయానికి 40 సెంట్లు, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించిన స్థలాలకు వెంటనే సరిహద్దులు వేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. కళాశాల స్థలంలో ఉన్న ఆక్రమార్కులను వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. గండిగుండం, శొంఠ్యాం ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములు పరిశీలనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకటికి రెండుసార్లు తనిఖీలు నిర్వహించాలని బృందానికి ఆదేశించారు. నేరుగా కొంతమంది రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, తహశీల్దార్ పేర్ల శ్యాం ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, సర్వే డిటి శ్రీనివాస రావు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుమార్తెపై తండ్రి అత్యాచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునే ఘటన ఆరిలోవ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఏ సమస్య వచ్చినా నేను ఉన్నానంట కన్న కూతురిని అనుక్షణం కాపాడుకోవాల్సిన తండ్రే రెండేళ్లుగా అత్యాచారానికి పాల్పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ కథనం ప్రకారం... ఒడిశా నయాఘడ్‌కు చెందిన చిత్తరంజన్ పాత్రో టైల్స్ పనిచేసుకుంటూ గత 20 ఏళ్లుగా ఆరిలోవ ప్రాంతంలో నివసిస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారునితో కలిసి ఉంటున్నాడు. అతని భార్య ఒక ఆసుపత్రిలో పనికి వెళ్తుంటుంది. పెద్ద కుమార్తె ఆరిలోవలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. బాలిక మంగళవారం ఉదయం పాఠశాలలో కళ్లు తిరిగి పడిపోయింది. ఉపాధ్యాయిని బాలికను ఆరా తీయగా తన తల్లి రాత్రిపూట పనికి వెళ్లే సమయంలో తండ్రే తనపై అత్యాచారానికి పాల్పడుతున్నట్టు తెలిపింది. ఈ విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని భయపెట్టేవాడని తెలిపింది. ఈ విషయాన్ని తల్లికి చెప్పి మంగళవారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా పోలీసుస్టేషన్ డిఎస్‌పి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సాగర్‌నగర్‌లో భారీ కొండచిలువ

ప్రజాశక్తి - ఆరిలోవ : సాగర్‌నగర్‌లోని హర్షటవర్ అపార్టుమెంట్‌ను ఆనుకొని ఉన్న ఆట మైదానంలోని నెట్‌లో ఒక భారీ కొండ చిలువ తల భాగం చిక్కుకొని కదలలేని పరిస్థితిలో ఉంది. నివాసులు చూసి భయపడి స్నేక్ క్యాచర్ కిరణ్ కుమార్‌కు సమాచారం అందించారు. కిరణ్ వచ్చి చాకచక్యంగా కొండ చిలువను పట్టుకున్నాడు. అనంతరం దానిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. పాములు కనిపిస్తే ఎవరూ చంప వద్దని, సమాచారం ఇవ్వాలని కిరణ్ కోరారు.

నేరాలు ఘోరాలు

కత్తితో భార్యా భర్తలపై దాడి - భార్య మృతి

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ పంచాయతీ శివారు గ్రామం శ్రీరాంపురం గ్రామంలో చిటికెల తాతీలు అనే వ్యక్తి ఆయన కుటుంబ సభ్యులైన చిటికెల అబ్బులు, ఆయన భార్య వరలక్ష్మిపై బుధవారం ఉదయం కత్తితో దాడి చేసాడు. స్థానికుల కథనం మేరకు...భార్యాభర్తల చేతులపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన గ్రామస్తులు బాధితులను నర్సీపట్నం ఏరియా హాస్పటల్‌కి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం సిర్లపాలెంలో బుధవారం నిప్పు అంటుకొని గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో తాళ్లవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన టి.వెంకట్రావు, కె.సురేష్, ఆర్.శంకరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.


తయారు చేస్తున్న సబ్బులను చూపిస్తున్న విద్యార్థులు

సబ్బుల తయారీలో నైపుణ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు రాయిపాలెం జివిఎంసి ఉన్నత పాఠశాల 7, 8 తరగతుల విద్యార్థులు జొన్న పిండి, ఆయిల్, డెటాల్ వినియోగించి సబ్బును తయారుచేశారు. రోజూ మధ్యాహ్న భోజనం చేసే ముందు తాము తయారుచేసిన సబ్బులతో చేతులు శుభ్రపరచుకొని భోజనం చేస్తామని ప్రజాశక్తికి తెలిపారు. పాఠశాల హెచ్ఎం జయంతి రాధా కుమారి ప్రోత్సాహం, సైన్స్, ఫిజిక్స్ టీచర్లు బి.శైలజ, ఎం.ప్రసన్న కుమారి తర్ఫీదు, వారి పర్యవేక్షణలో తాము సబ్బుల తయారీ విధానాన్ని నేర్చుకున్నట్లు పలువురు విద్యార్థులు చెప్పారు. తయారుచేసే సబ్బులను 'సోప్ బ్యాంక్' పేరుతో బాక్స్‌లో నిల్వ ఉంచుతామని తెలిపారు.

మధురవాడలో చెరువులను సంరక్షించండి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మధురవాడలో చెరువులను సంరక్షించాలని, వార్డు అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ మొల్లి హేమలత బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కోరారు. మధురవాడ సర్వే నెంబర్ 61లోని బొట్టవానిపాలెం వెంపల చెరువు, సర్వే నెంబర్ 65లోని నగరంపాలెం రాళ్ల చెరువులు పంట పొలాలకు నీరు అందించేవని, ప్రస్తుతం అవి నీటి సామర్థ్యం తగ్గిపోయి కళావిహీనంగా మారాయని వివరించారు. చెరువులలో పూడికలు తీయించి ట్యాంక్ బండ్, వాకింగ్ ట్రాక్, ఆధునీకరణ పనులు చేయించాలని కోరారు. వీధిలైట్లు, తాగునీరు, వీధి కాలువలు, రోడ్లు నిర్మాణం, యుజిడి, సమస్యలు పరిష్కారం చూపాలని కోరారు. రెండు దశాబ్దాల క్రితం ఏర్పడిన అయోధ్యనగర్ కాలనీకి మౌలిక వసతులు, తుపాను విపత్తుల నుంచి రక్షణకు కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడ, మెట్ల మార్గాలు నిర్మించాలని కోరారు. అనంతరం జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు.

మద్యం షాపుల్లో గీత ఉపకులాలకు 10 శాతం కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి- ఆనందపురం: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే గీత ఉప కులాలకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసినందుకు ఆంధ్రప్రదేశ్ యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు విశాఖ వచ్చిన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను బుధవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు


అధ్వానంగా ఉన్న పాత కర్ణవానిపాలెం రహదారి

అభివృద్ధికి నోచని రహదారి

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు వై జంక్షన్ నుంచి పాత కర్ణ వానిపాలెం రహదారి అభివృద్ధికి దూరంగా ఉంది. ఈ రహదారి వెంబడి ప్రతిరోజు వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మట్టి రోడ్డు కావడంతోపాటు గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు వాటిలో పడి గాయాలు పాలవుతున్నారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు నడవలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్ దీపాలు లేక రాత్రి సమయంలో గుంతలు కనబడక ప్రమాదాలు మరిన్ని ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు స్పందించి రహదారి ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇన్చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంఆర్ఎస్ అప్పారావును వివరణ కోరగా వచ్చే ఆర్థిక సంవత్సరం నిధుల్లో కేటాయింపులు చేసి రహదారిని అభివృద్ధి చేస్తామని తెలిపారు.



ధర్నా చేస్తున్న భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ఉచిత ఇసుక ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : ఉచిత ఇసుక ఇవ్వాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన కొత్త గాజువాక సెంటర్లో ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇసుక లేక గాజువాకలో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఆకలితో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే ఇసుక సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, అధికారంలోకి రాకముందు చంద్రబాబు ఇసుక ఉచితంగా ఇస్తానని మేనిఫెస్టోలో పెట్టి, ఇప్పుడు పాత ధరకంటే ఎక్కువకు అమ్ముతున్నారని, బ్లాక్ మార్కెట్లో విక్రయాలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు అగనంపూడి యార్డులో లక్షల టన్నుల ఇసుక ఉండేదని, ఆ ఇసుక ఏమైందో అర్థం కాని పరిస్థితి ఉందని తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జీతాలకు కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఆగస్టు నెల జీతాలు చెల్లించాలని కోరుతూ హెచ్ఒడి ఆఫీసు వద్ద స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పి, టిఎంసి కార్మికులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, పునిక్స్, మాస్, నాగార్జున వంటి టిఎంసి కాంట్రాక్టర్ల వద్ద సుమారు 500 మంది పని చేస్తున్నారని, వీరికి కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించకపోతే ఉక్కు యాజమాన్యం కలుగజేసుకుని జీతాలు చెల్లించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. జీతాలు చెల్లించడానికి ముందుకు రాకపోతే హెచ్ఒడి ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపప్రధాన కార్యదర్శి పి.మసేను, ఉపాధ్యక్షుడు నమ్మి సోమునాయుడు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిఎస్‌వి.శ్రీనివాసరావు, నాయకులు బి.ఆనంద్, ఎల్.బంగారయ్య పాల్గొన్నారు. అనంతరం హెచ్ఒడికి వినతిపత్రం అందజేశారు.


ధర్నా చేస్తున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తరం నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైంది. అయింది. అధికారుల నిర్లక్ష్యంతో ఎంతో విలువైన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. నగరంలో స్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో విలువైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన జివిఎంసి యంత్రాంగం గాలికి వదిలేసింది. రూ. కోట్ల విలువైన స్థలాలను పరిరక్షించకపోవడంతో ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడుతున్నారు. కొన్నిచోట్ల పిచ్చి మొక్కలు పెరిగి, చెత్త పేరుకు పోయి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. వీటి వల్ల చుట్టుపక్కల నివాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జివిఎంసి 26వ వార్డు పరిధి శాంతిపురంలో పద్మశ్రీ హాస్పిటల్ ఎదురుగా 120 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ.కోటిన్నర ఉంటుంది. ఇంత విలువైన స్థలాన్ని జివిఎంసి పట్టించుకోకపోవడంతో ఒక వ్యక్తి ఆవులు కట్టే నెపంతో ఆక్రమించి నాలుగేళ్లపాటు తన అదీనంలో ఉంచుకున్నాడు. తర్వాత షెడ్డు నిర్మాణం చేపట్టాడు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో జివిఎంసి అధికారులు స్పందించి ఆక్రమణను తొలగించి కంచెవేశారు. ప్రభుత్వ స్థలం అని బోర్డు పెట్టారు. కొద్ది నెలలు కిందట ఆ కంచె ధ్వంసమైంది. బోర్డు మాయమైంది. దీంతో మళ్లీ ఆక్రమణకు సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోందని స్థానికులు చెబుతున్నారు. జివిఎంసి 25వ వార్డు పరిధి శాంతిపురం శంకరమఠం మెయిన్ రోడ్డులో ఇందిరమ్మ ఇళ్లను ఆనుకొని 100 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. దీని విలువ రూ.కోటిపైనే ఉంటుంది. ఇంత విలువైన స్థలాన్ని జివిఎంసి గాలికి వదిలేసింది. ప్రభుత్వ స్థలం అని హెచ్చరిక బోర్డు గానీ, చుట్టూ కంచె, ప్రహరీ ఏర్పాటు చేయలేదు. జివిఎంసి 26వ వార్డులో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీస్ ఎదురుగా 150 గజాలు ప్రభుత్వ స్థలం ఉంది. గతంలో కొంతమంది ఆక్రమించడానికి ప్రయత్నించి పనులు నిర్వహించగా రెవెన్యూ అధికారులు వచ్చి తొలగించారు. ప్రహరీ, పెన్సింగ్ చేపట్టలేదు. జివిఎంసి 26వ వార్డు ఎన్జీవోస్ కాలనీలో సాయికుటీరా ఎదురుగా సుమారు 600 గజాలు ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలం పరిరక్షణకు జివిఎంసి చర్యలు చేపట్టకపోవడంతో ఆ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి కొంత స్థలాన్ని ఆక్రమించి షెడ్డు, బాత్రూం నిర్మించి సొంతానికి వాడుకుంటున్నాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసిన జివిఎంసి అధికారులు చర్యలు చేపట్టలేదు. అక్కడ మిగిలిన స్థలాల్లో కూడా పిచ్చి మొక్కలు పెరిగాయి.


పద్మశ్రీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలం

జివిఎంసి 25వ వార్డులో ప్రిజం కాలేజీ ఎదురుగా 2000 గజాల ఖాళీ స్థలం ఉంది. ఎన్నో సంవత్సరాల నుంచి దీనిని ఎవరూ పట్టించుకోలేదు. గతంలో కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేశారు. స్థానికులు ఫిర్యాదులతో స్థలంలో ప్రభుత్వానికి చెందిన స్థలం అని జివిఎంసి, తహశీల్దార్ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు ఆ స్థలంలో సామాజిక భవనం, కళ్యాణ మండపం, పార్కు ఏర్పాటుచేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జివిఎంసి యంత్రాంగం ప్రభుత్వ స్థలాలపై సర్వే చేసి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పేదల కోసమే పైడా జీవితం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు


పైడా సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : పేదల కోసమే పైడా సత్యనారాయణ పనిచేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. మిండి అరుణోదయ కళా సమితి ఆధ్వర్యాన పైడా సత్యనారాయణ ప్రథమ వర్ధంతి సభను మిండి గురజాడ కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి మౌనం పాటించారు. అనంతరం జరిగిన సభలో జగ్గు నాయుడు మాట్లాడుతూ, సత్యనారాయణ మృదు స్వభావి అన్నారు. నిస్వార్థంగా పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. పదిమందికి ఉపయోగపడాలనుకునే తపనతో, కష్టజీవుల కోసం పనిచేశారని తెలిపారు. బిహెచ్‌పివిలో ఉద్యోగం చేస్తూ పేదల కోసం పనిచేసేవారన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా పేదల పక్షాన పని చేశారని గుర్తుచేశారు. వైసిపి నాయకులు గుడివాడ అప్పల రామ్మూర్తి మాట్లాడుతూ, సత్యనారాయణ బిహెచ్‌పివి స్టోర్‌లో సుదీర్ఘ కాలం పని చేశారంటే ఆయన నిజాయతీ ఎంత గొప్పదో తెలుసుకోవచ్చన్నారు. అరుణోదయ కళా సమితి ప్రధాన కార్యదర్శి వర్రి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో బిహెచ్‌పివి సిఐటియు మాజీ ప్రధాన కార్యదర్శి స్వామినాథన్, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి, గోపాలపట్నం సిపిఎం నాయకులు బి.వెంకట్రావు, అరుణోదయ కళా సమితి అధ్యక్షులు ఆర్.నానాజీ, సంఘం నాయకులు సిగటాపు రాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం నాటికను ప్రదర్శించారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కె.నగరపాలెంలో ఇది మంచి ప్రభుత్వంపై సభ నిర్వహించారు. జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు

గాజువాక : కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను సచివాలయ సిబ్బందితో కలిసి గాజువాక బీసీ రోడ్డు, సంజీవగిరి కాలనీలో బుధవారం 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పంచిపెట్టారు. కొన్నింటిని గోడలపై అతికించారు.


గోపాలపట్నం మండలం వెంకటాపురంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గోపాలపట్నం : గోపాలపట్నం మండలం వెంకటాపురంలో ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరై కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి కె.అప్పలస్వామి, తహసీల్దార్ రమేష్, కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 67వ వార్డు పరిధి హైస్కూల్ రోడ్డులోని శ్మశాన వాటికలో జన విజ్ఞాన వేదిక, సిపిఎం ఆధ్వర్యాన పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్త లేకుండా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ కుమార్, కిరీటం, కె.సంతోషం, కెపి.కుమార్, యూత్ సభ్యులు బాలు, మధు మాస్టర్, సాయిరాం నగర్, శంకర్ నగర్ ప్రజలు, 67వ వార్డు జివిఎంసి సిబ్బంది, శాఖా కార్యదర్శి పాలూరు లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

27న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : తగరపువలస, సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి ఆధ్వర్యాన ఈ నెల 27వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక సెయింట్ పీటర్స్ చర్చి ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వైద్య సేవలు, సాధారణ శస్త్ర చికిత్సలు, నేత్ర, దంత, చెవి, ముక్కు, గొంతు, పిల్లలు, స్త్రీ లకు సంబంధించి నిపుణులచే వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బిపి, సుగర్, ఇసిజి తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానికులను కోరారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని చిన్నాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా లైంగికంగా సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. లింక్ వర్కర్ స్కీమ్ సిఎల్‌డబ్ల్యు ఎం.జ్యోతి మాట్లాడుతూ, లైంగికంగా సంక్రమించే హెచ్ఐవి తదితర అంటువ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2 నెలల పాటు 'మీకు తెలుసా' జిల్లా స్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ (ప్రివెన్షన్ కంట్రోల్) యాక్టు -2017 గురించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎ.బాలామణి, ఎఎన్ఎమ్ భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు ఎస్.లక్ష్మి, ఎమ్.రామలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన థాలీ బజావో



అనకాపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్రంలోని టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం థాలీ బజావో కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్, నాయకులు కార్యకర్తలు ప్లేట్లు పట్టుకొని గరిటెలతో వాటిని మోగిస్తూ పెద్ద ఎత్తున శబ్దం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు (హాసిని వర్మ) మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని గొప్పగా చెప్పి వాటిలో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. వంద రోజుల పాలనలో ఏదో సాధించామని గొప్పలు చెబుతూ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. రైతులకు రూ. 20 వేలుఇవ్వాలన్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, మహిళలకు రూ.15 వేలు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి సంతోష్ కుమార్, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి కలెక్టరేట్ కార్యాలయం వద్ద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో బుధవారం థాలీ బజావో కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలు ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచినా అమలు చేయనందుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహించారు. నిరసన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి.కిషోర్, ఉపాధ్యక్షులు బి.బాల మురళి, పీసీసీ సభ్యులు టి. రమణ,ఎం. కోటేశ్వరరావు, బి. భాను మూర్తి యాదవ్, పడాల కొండల రావు, కె.సత్యనారాయణ,కత్తెర శ్రీధర్, ఆది మూర్తి, ఆర్ ఆర్ నాయుడు, జి శ్రీనివాస్, యేసు రాజు, దాలినాయుడు, బి.రమణ, ఏం.చంటి, ఎస్.ఈశ్వర రావు, సంజీవ్, కోటేశ్వరరావు, పరదేశి, సిద్ధా పాల్గొన్నారు

పంట రుణాలు సకాలంలో చెల్లించాలి


మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యేశ్వరి

ప్రజాశక్తి -కశింకోట : రైతులు సకాలంలో పంట రుణాలు తిరిగి చెల్లించాలఅని నర్సింగబిల్లి సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి ఎ.సుబ్రహ్మణ్యశ్వేరి అన్నారు. బుధవారం మండలంలో నర్సింగబిల్లి సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశం సంఘ అవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి రైతు సంఘ కార్యక్రమంలో పాలు పంచుకోవాలన్నారు, సంఘం ద్వారా పంట సాగుకు రుణాలు ఇస్తామన్నారు. 2013లో 4, 5 విడతల రుణ మాఫీకి, గత బకాయిలకు ఒన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు తీర్మానం చేశారు 2023- 24 జమా ఖర్చులు ఆమోదం, 2024- 25 అంచనా బడ్జెట్, అడిట్ నివేదిక సమావేశంలో వివరించారు. సమావేశంలో కలిగేట్ల సింహాద్రి, మాజీ ఎంపిటిసి మజ్జి నిరంజన్ కుమార్, కోన నాగేశ్వరరావు, మజ్జి కన్నబాబు, కోన సత్య నారాయణ, కోన సురేష్, కార్యదర్శి నక్క అచ్చయ్య నాయడు రైతులు పాల్గొన్నారు.

మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న రవి కుమార్

ప్రజాశక్తి- మునగపాక: క్రీడల వల్ల మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించు కోవచ్చునని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సోదరులు సుందరపు రవికుమార్ అన్నారు. మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా బుధవారం స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు నేడు అన్నిరంగాలలో మందంజలో ఉండడం ప్రశంసనీయ మన్నారు. రాష్ట్రస్థాయి నుండి దేశ, ప్రపంచ స్థాయిలలో తమ నైపుణ్యాన్ని చాటి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి


మాట్లాడుతున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్

ప్రజాశక్తి-కశింకోట : గ్రామాల్లో గృహాల సందర్శన సమయంలో కుష్టువ్యాది .గ్రస్తులను గుర్తించాలని కుష్టువ్యాధి నిర్మూలన రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.దేవసాగర్ సూచించారు. బుధవారం తాళ్లపాలెం పిహెచ్‌సిని సందర్శించారు. పర్యవేక్షక వైద్యసిబ్బంది, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి, ఆశాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కుష్టువ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వపరంగా ఇస్తున్న మందులు, ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలన్నారు. గుర్తించిన రోగులకు సకాలంలో మందులు అందజేయాలన్నారు. కుష్టువ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా ప్రజలను చైతన్యపరచాలన్నారు.

డాక్టర్.డి. ప్రియదర్శిని, డాక్టర్ సి. ధాత్రిప్రియ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి. వైద్యాధికారి డాక్టర్. ఎం.రమేష్, సిబ్బంది ఎంఎస్‌వి. ప్రసాద్, ఆరోగ్య బోధకుడు ఎవి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

డైట్‌లో ఎన్ఎస్ఎస్ దినోత్సవం



మాట్లాడుతున్న డైట్ చైర్మన్ రత్నాకర్

ప్రజాశక్తి- అనకాపల్లి : డైట్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కళాశాల చైర్మన్ రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. మోహన్ రావు పాల్గొన్నారు. సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు చూపిస్తున్న అంకితభావం అత్యంత ప్రశంశనీయం రత్నాకర్ కొనియాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ సేవల ద్వారా సానుకూల మార్పును తీసుకురావడానికి ఒక శక్తివంతమైన సాధనంగా ఎన్ఎస్ఎస్ మారుతోందన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల భాగస్వామ్యం కేవలం వ్యక్తిగత ప్రగతికి మాత్రమే కాకుండా, సమాజ శ్రేయస్సు దిశగా సాగడంపై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ క్యాడెట్లకు సర్టిఫికెట్లు బహూకరించారు.

ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని నిరసన


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐక్యవేదిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : డాక్టర్ అంబేద్కర్ ఫ్లెక్సీ చింపిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టర్‌పై దాడి చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ దేవరాపల్లిలో దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచే విధంగా ప్రవర్తించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టర్ పై దాడి చేసి బహిరంగంగా కులం పేరుతో దూషించిన ఎమ్మెల్యే పంతం నానాజీలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు జరిగిన మండల కమిటీ సమావేశంలో ఇటీవల హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కార్లి సాయి సుందరరావును శాలువాతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో మండల దళిత నాయకులు కాటపల్లి అప్పారావు, వేచలపు గంగాధరరావు, పరవాడ అప్పారావు, సబ్బవరపు మాలిబాబు,కంచిమాల అప్పారావు, తాడి ఎర్నిబాబు, కాటపల్లి నాగభూషణం, ఉల్లి దేముళ్ళు, కన్నాబత్తుల రాజు, కాటపల్లి అప్పారావు (వెలుగు) సబ్బవరపు దారప్పు, డేగల సుదర్శన్, దువ్వాడ రమేష్, పరశురామ్, సన్నిబాబు, నరసింహమూర్తి, కామరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యల పరిశీలన


ఉమ్మడి పరిశీలనలో ఎమ్మెల్యే సుందరపు, కలెక్టర్ విజయ

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలో పరిష్కారం కానీ సమస్యలపై బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఉమ్మడి పరిశీలన చేశారు. ఎస్ఇజెడ్ పునరావాస కాలనీలో క్రీడా మైదానం కేటాయింపునకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. కాలనీలో యువకులు విద్యార్థులు ఆటపాటలకు అనుకూలంగా స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. అచ్యుతాపురం జంక్షన్‌లో ప్రతిపాదించిన జంక్షన్ విస్తరణ పనులు పరిశీలించారు. ఎలమంచిలి గాజువాక, జిపివై రోడ్డు నుంచి అప్పన్నపాలెం జంక్షన్‌లో ప్రారంభమైన రహదారి నిర్మాణానికి ప్రతిపాదించిన స్థల సమస్యపై చర్చించారు. ప్రతిపాదించిన రహదారి నిర్మాణ పనులు చేపట్టినట్లయితే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని జిల్లా కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువచ్చారు. పర్యటనలో అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికష్ణ, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

పంచదార్ల పుణ్యక్షేత్రం అభివృద్ధికి చర్యలు

రాంబిల్లి :మండలంలోని పంచదార్ల పుణ్యక్షేత్రాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఆర్‌డిఒ చిన్నికృష్ణ బుధవారం సందర్శించారు. ఈ క్షేత్రం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన జగదీష్


లోకేష్‌ను శాలువాతో సత్కరిస్తున్న జగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖపట్నంలో ఐటీ సదస్సుకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బుధవారం మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంచి ప్రభుత్వం కార్యక్రమాలు ఈ విజయవంతంగా సాగుతున్నాయని, ప్రజల్లో మంచి స్పందన వస్తోందని, పార్టీ కార్యకర్తలు నాయకులు మహిళలు రైతులు పాల్గొంటున్నారని లోకేష్‌కు నాగ జగదీష్ వివరించారు.

రామ్‌కో సిమెంట్స్‌కు నాణ్యతా పురస్కారం



అవార్డు అందుకున్న రామ్‌కో యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని ఎఎస్.పేట రామ్‌కో సిమెంటు కర్మాగారానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నాణ్యతా అవార్డు దక్కింది. సిమెంట్ తయారీలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించి నాణ్యమైన సిమెంట్ అందిస్తున్న ఈ కర్మాగారానికి అవార్డు రావడం ఆనందదాయకమని సంస్థ జిఎం ఎన్.సికేంద్ర భాషా, డిజిఎం ప్రోసెస్ ఇన్చార్జి సిహెచ్ సురేష్ కుమార్ అన్నారు. విజయవాడలో బీఐఎస్ సీనియర్ డైరెక్టరు ఎం.విజే వినోద్ నుంచి డిజిఎం సురేష్ కుమార్ అవార్డును స్వీకరించారు. కార్మికుల, ఉద్యోగుల సమష్టి కృషితో ఈవిజయం లభించిందన్నారు.

సంగీత ప్రపంచానికి బాలు స్ఫూర్తి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ గాయకులు ఎస్‌పి బాలసుబ్రమణ్యం జీవితం సంగీత ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు, సంగీత దర్శకులు ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ అన్నారు.బుధవారం పద్మవిభూషణ్ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి ఉడ్‌పేటకళ్యాణి అకాడమి ఆఫ్ ఆర్ట్స్‌లో ముందుగా బాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రం ద్వారా గాయకునిగా సినీ రంగప్రవేశం చేసి 2020 వరకు 50వేల పాటలకు పైగా పాడారని, సంగీత దర్శకునిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, నటునిగా, నిర్మాతగా అనేక శాఖలలో తనదైన ముద్రను వేశారన్నారు. తమ తరం అందరికీ రాబోయే తరాలకు ఆయన గొప్ప స్ఫూర్తి అని, బాలు జీవితంలో పాడిన ఒకేఒక్క లఘుచిత్రానికి సంగీత దర్శకునిగా చేయడం తన అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా కళ్యాణి అకాడమి విద్యార్థులు ఆలపించిన బాలు మధుర గీతాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో అకాడమి ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎస్‌పి బాలుకు నివాళులర్పిస్తున్న కళ్యాణి అకాడమీ

జలదిగ్బంధంలో సాయినగర్



సాయినగర్‌లో ఇళ్లల్లోకి చొరబడిన వర్షపునీరు

ప్రజాశక్తి- అనకాపల్లి : గతరాత్రి కురిసిన వర్షానికి అనకాపల్లి శారదానగర్, సాయినగర్ జలదిగ్బంధంలో మునిగాయి. కుండ పోత వర్షానికి రోడ్లు జలమయం కావడంతో పాటు పలువురి ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో ఇళ్లల్లో నుంచి బయటకు రాలేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఈ దుస్థితి తరచూ ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు తమ పరిస్థితిని గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇళ్ల పన్నులు వసూలు చేస్తున్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులకు ఉండటం లేదని వాపోయారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని కోరుతున్నారు.

నీట మునిగిన వరి పంట



ఫోటో౦ వర్షానికి నీటి మునిగిన వరి పంట

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షానికి కశింకోట గ్రామం శారదా నది పక్కన వున్నా పొలాల్లో వరి పంట మునిగింది. పెద్దఎత్తున నీరు చేరడంతో నీటి నిల్వతో పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం ముంపు బారిన పడిన పొలాలను వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు పరిశీలించారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు



నులిపురుగుల నివారణ మాత్రలను వేయిస్తున్న హెచ్ఎం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా ఈ మాత్రలను వేసుకోవాలని సూచించారు. ఈనెల 17న నిర్వహించిన డివార్మింగ్ కార్యక్రమంలో మాత్రలు వేసుకోకుండా మిగిలిన విద్యార్థులకు బుధవారం మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ఫస్టియర్ డిగ్రీ విద్యార్థులకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-చోడవరం రూరల్: వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుపబడుతున్న విద్యార్థి డిగ్రీ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆహ్వానం పలుకుతూ వినూత్న కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆలోచింపజేశాయి. ముఖ్యంగా సాయి అనే విద్యార్థి 'అమ్మ ఒక్కతే ప్రేయసి ఒక్కతే' అనే ప్రదర్శన కన్నీరు పెట్టించింది. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూసర్ల సంతోష్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అదట్రావు రామారావు, వేచలపు అర్జునరావు, ఎం. శంకర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పీపురుపల్లి దేముడునాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష విరమణ

ప్రజాశక్తి -అనకాపల్లి : తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం తయారీలో జంతు అవశేషాలతో చేసిన కల్తీ నెయ్యి వినియోగించి పాపాన్ని మూటకట్టుకున్న వైసిపి ప్రభుత్వం వైఖరిని ఖండిస్తూ నిరసనగా అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కూటమి నాయకులు భీమరశెట్టి రామ్ పాయశ్చిత్త దీక్ష చేపట్టారు. బుధవారం రామ్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్‌తో బెంబేలు

ప్రజాశక్తి- కశింకోట :మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి 10 గంటలు సమయంలో వర్షం పడుతున్నప్పుడు కొండచిలువ హల్‌చల్ చేసింది. చెరువు గట్టు కింద భాగంగా వర్షంలో పాకుతూ వెళ్తూ రోడ్డుపైకి రావడానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో వాహనాల లైటింగ్‌కు మరలగట్టు పక్క నుండి జారుకుంది.15 అడుగులు పొడవు ఉంటుందని స్థానికులు తెలిపారు. కొండచిలువ సంచారంతో చెరువు గట్టు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో సీనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి- కశింకోట : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జవ్వాది వెంకట సత్యనారాయణ అనారోగ్యంతో విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. అల్లూరి జిల్లా, జి మాడుగుల మండలం వంతల గ్రామానికి చెందిన . సత్యనారాయణ ఉద్యోగరీత్యాకొంతకాలంగా కసింకోట తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సత్యనారాయణ మృతి పట్ల డిటి కె.సురేష్ నాయుడు, ఎంఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ దినేష్, కార్యాలయ సిబ్బంది ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఎస్ఐకి ఘనసత్కారం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :బుచ్చయ్యపేట మండల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా విధుల్లో చేరిన ఎ.శ్రీనివాసరావును బుధవారం మండలంలోని సర్పంచులు గోలజాన శ్రీను, ముచ్చకర్ల అప్పారావు, పేదిరెడ్ల మాణిక్యం మర్యాదపూర్వకంగా కలిసారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితునికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి -చోడవరం/బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామానికి చెందిన సింగంపల్లి రాజు అనే నిందితునికి హత్య ప్రయత్నం కేసులో చోడవరం కోర్టులో బుధవారం సివిల్ జడ్జి రాజేంద్రబాబు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. వివరాలివి. బంగారు మెట్ట గ్రామానికి చెందిన ముత్యాల నూకరాజు తన కూతురును సింగంపల్లి రాముకు ఇచ్చి వివాహం చేశారు వరకట్నం విషయమై అల్లుడు, మామకు తరచూ గొడవలు వస్తున్న నేపథ్యంలో, 2021 జూలై 29న మామ ముత్యాలుపై అల్లుడు సింగంపల్లి రాము కత్తితో దాడి చేశాడు. ఘటనపై అప్పట్లో బుచ్చయ్యపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నేరాభియోగ పత్రాలను దాఖలు చేశారు. కేసులో వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి శిక్షణ ఖరారు చేయడంతో పాటు బాధితునికి రూ.25వేలను నిందితుడు చెల్లించాలని తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రభుత్వ న్యాయవాది వి వెంకటరావ పోలీసులు బాధితుల తరపున వాదించారు.

ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట పోలీస్ స్టేషన్ ఎస్ఐలుగా మనోజ్ కుమార్, లక్ష్మణరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు, అల్లూరి జిల్లా పెదబయలు నుంచి మనోజ్ కుమార్, అనకాపల్లి జిల్లా కొత్తకోట నుంచి లక్ష్మణరావు బదిలీపై వచ్చారు, అనంతరం సిఐ వినోద్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా సిబ్బంది వారిని స్వాగతించి, అభినందనలు తెలిపారు.

తహశీల్దార్‌గా రామారావు

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం తహసిల్దారుగా అంబటి రామారావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రామారావు రాష్ట్ర సెక్రటేరియట్‌లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తిరుమల బాబు కోటవురట్ల తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.



అంబటి రామారావు

క్రీడా పోటీలలో విద్యార్థుల సత్తా



మునగపాకలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని గణపర్తి గ్రామ హైస్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడలు బుధవారంతో ముగిసాయి. కార్యక్రమానికి ఎంపిపి మళ్ల జయలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని, విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల డైనింగ్ హాల్‌లో 8 ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్‌లైట్లు తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని హామీని ఇచ్చారు. జనసేనమండల ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సాహించడానికి స్థానిక జనసేన నాయకులు సమకూర్చిన రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ కాండ్రేగుల వెంకట్రావు, కూటమి నాయకులు కె రాజశేఖర్, ఆడారి సాంబమూర్తి, మాజీ సర్పంచ్ పెంటకోట నర్సింగరావు, కాండ్రేగుల నాయుడు, మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ, ఎల్లపు శ్రావణ్, కర్రి వెంకు నాయుడు, ప్రసాదు, మారిశెట్టి సాయిరాం, చూచుకొండ ఎంపిటిసి కాండ్రేగుల కిరణ్, స్కూల్ హెచ్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల సత్తా

దేవరాపల్లి: ఎస్‌జిఎఫ్ ఆటల పోటీలలో గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 20, 21 తేదీలలో దేవరాపల్లిలో జరిగిన ఆటల పోటీలలో అండర్-14 బాలుర విభాగంలో ఖోఖో వాలీబాల్, చదరంగం, యోగా, వాలీబాల్ పోటీలలో ప్రథమ స్థానం సాధించారు. కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు. సీనియర్ విభాగంలో అండర్ 17 వాలీబాల్ ద్వితీయ స్థానం సాధించారు. అథ్లెటిక్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.తరుణేశ్వరరావు. విద్యార్థులను అభినందించారు.



దేవరాపల్లిలో ప్రతిభ చూపిన గురుకుల విద్యార్థులు

జంపపాలెం హైస్కూలుకు పతకాల పంట

యలమంచిలి : మండల స్థాయి ఆటల పోటీల్లో జంపపాలెం హైస్కూలు విద్యార్థులు అత్యధిక పతకాలు సాధించారని హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శాస్త్రి తెలిపారు. అండర్ - 14 బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్‌లోను, అండర్ -17 బాలికల విభాగంలో చదరంగం, షటిల్, ఖోఖో,వాలీబాల్‌లో విజేతలుగా నిలిచారన్నారు. మండలస్థాయి ఎంపికైన క్రీడాకారుల్ని నియోజకవర్గ స్థాయికి పంపుతామని తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారుల్ని హెచ్.ఎం, ఏవిఎస్ శాస్త్రి, పి.డి. సబ్బీర్, స్కూలు సిబ్బంది, మేనేజిమెంట్ కమిటీ చైర్మన్ అభినందనలు తెలిపారు



యలమంచిలిలో పతకాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

రాష్ట్రస్థాయి జూడో పోటీలో వడ్డాది విద్యార్థి ప్రతిభ

వడ్డాది : ఈనెల 22,23న తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 జూడో పోటీల్లో వడ్డాది కోవెల అప్పన్న దొర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బాలుర 40 కేజీల విభాగంలో 8వ తరగతి విద్యార్థి గోడ చరణ్ సత్తాచాటి ద్వితీయ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించాడు. బుధవారం పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో చరణ్‌ను హెచ్ఎం వి.వెంకటరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కోవెల వెంకటరమణ, ఎస్‌వి. సత్యనారాయణ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు



వడ్డాదిలో రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి:మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో డి.సీతారామరాజు ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు.లక్ష్యానికి అనుగుణంగా పనులను గుర్తించి, ఎక్కువమంది కూలీలకు పనులు కల్పించే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సోషల్ ఆడిట్ రికార్డ్స్ సిద్ధం చేయాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ భాగ్యలత, టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, విఆర్‌పిలు పాల్గొన్నారు.

30 లీటర్ల నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన గెమ్మెల రామన్న దొర, వల్లపు రాజబాబుల వద్ద 30 లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నామని గొలుగొండ ఎస్సై రామారావు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.


మూగజీవాలకు టీకాలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పలు గ్రామాల్లో మూగ జీవాలకు టీకాలు వేయడం జరుగుతుందని పశువైద్యాధికారి సాగరి గణేష్శ్వరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, కాశీపట్నం పంచాయతీ బంగారమ్మ పేట, సారవనిపాలేంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేశామన్నారు.

సిఎంను కలిసిన బత్తుల, పీలా

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తనకు అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. తనకు పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

అనకాపల్లి:గుంటూరులోని సచివాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.



సిఎంకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న బత్తుల, పీలా

అంతకుముందు సచివాలయంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేషన్ల చైర్మన్లను కలిశారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి కృష్ణ క్లబ్ ఆవరణలో బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ముగ్గుల పోటీలను నిర్వహించారు. న్యాయనిర్ణేతగా తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు వ్యవహరించారు. ఎంతో ఉత్సాహంతో 40 మంది మహిళలు, విద్యార్థినిలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రోత్సాక బహుమతులను అందజేశారు.



ముగ్గులు పరిశీలిస్తున్న ఆచార్యులు



చెక్కును ఇస్తున్న డైరెక్టర్ విజయ్ ప్రకాష్

ముఖ్యమంత్రి వరద సహాయ నిధికి

శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు రూ.10 లక్షల విరాళం

- డిప్యూటీ సిఎంకు చెక్కు అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి: ఇటీవల సంభవించిన వరదల నేపథ్యంలో సహాయం చేయడానికి శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు ముఖ్యమంత్రి వరద సహాయ నిధికి రూ. రూ.లక్షల విరాళం ప్రకటించాయి.ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కు విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయ్ ప్రకాష్ విరాళాన్ని అందచేశారు. వరదలతో ప్రభావితులైన వారికి సహాయపడాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ సిహెచ్.వి.కె. నరసింహారావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తాము ఎల్లప్పుడూ అండగా నిలబడతామని, ప్రభుత్వ సహాయ ప్రయత్నాలకు తమవంతు బాధ్యతగా ఈ విరాళం అందిస్తున్నామని తెలిపారు. ఈ సహాయం ద్వారా పునరావాసం, నష్టపరిహారం, సహాయక చర్యలలో వారికి కొంత ఉపశమనం కలగాలని ఆశిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జరుగుతున్న పునరావాస చర్యలకు అభినందనలు తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందించడం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు.

వరి పొలాల్లో తెగుళ్లపై అవగాహన



కొత్తకోటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- నక్కపల్లి:పొటాషియం లోపం సవరించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని శాస్త్రవేత్త బి.నాగేంద్ర అన్నారు. మండలంలోని డొంకాడ, గొడిచెర్ల గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసిటి-కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి పొలాలలో పొటాషియం లోపం కనిపిస్తుందని పొటాషియం లోపాన్ని సవరించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, సూక్ష్మ సేద్య వ్యవసాయ అధికారిని బుజ్జమ్మ, స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకులు రజిత, సురేంద్ర, వ్యవసాయ విస్తరణ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తకోట:భూ పరిరక్షణతో రైతులు అధిక దిగుబడి సాధించ వచ్చునని రావికమతం మండలం వ్యవసాయాధికారిణి డి.రూప సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రావికమతం మండలంలో కొత్తకోట, కన్నంపేట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ సంరక్షణ చేస్తే అధిక రాబడి ఉంటుందన్నారు. పశు సంవర్ధక శాఖ వైద్యులు బాలతేజ పశువులకు టీకా మందులపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు జి.శ్రీను, జి.సుధామణి, కొత్తకోట గ్రామ సర్పంచ్ కొన లోవరాజు ఉప సర్పంచ్ పి దేవా,ఎంపిటిసి పూడి దేవ, చోడవరం నియోజక వర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు నీలవేణి, వీఆర్పీ బాబురావు పాల్గొన్నారు.

మాడుగుల: అధిక దిగుబడులే లక్ష్యంగా "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం వాసుదేవరావు తెలిపారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

మండలంలోని బుధవారం పోతనపూడి, వీరవిల్లి అగ్రహారం గ్రామాలలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం, కొండెంపూడి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్. రాజ్ కుమార్, డాక్టర్ ఏ.సౌజన్య, నర్సీపట్నం వ్యవసాయ సహయ సంచాలకులు టి.శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు, పశు వైద్యాధికారి పి.మణి లక్ష్మణ్, పోతన పూడి గ్రామ సర్పంచ్ కోరుకొండ సాంభమూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని సీతానగరం, తగరంపూడి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి మోహనరావు, అనకాపల్లి ఎడిఎ రామారావు, రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ శ్రీధర్, మురళి పాల్గొని ఎరువులు రాయితీ వివరాలు, పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీతానగరంలోని వరి పొలాలను సందర్శించారు. తగరంపూడి గ్రామంలోరైతులకు మండల వ్యవసాయాధికారి పి రంగాచారి పలు వ్యవసాయ సూచనలు చేశారు. ఆర్ఎఆర్ఎస్ వ్యవసాయ శాస్త్రవేత్త రమణమూర్తి,పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామారావు, మార్కెటింగ్ శాఖ రాజేష్, సర్పంచులు సుంకర చంటి, యాదగిరి అప్పారావు, రైతు నాయకులు ప్రకాష్, సేంద్రియ వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది: వడ్డాదిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి బి.భాస్కరరావు పాల్గొని, వరిపొలంలో చీడపీడలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్, భాగ్యలక్ష్మి, ఇరిగేషన్ శాఖ శివకుమార్, మైక్రో ఇరిగేషన్ శాఖ సతీష్, మార్కెటింగ్ శాఖ ప్రతినిధి రాంబాబు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరప్పారావు ,దొండ నారాయణమూర్తి వెంకటరమణ వార్డు మెంబరు ఈశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు అధిక దిగుబడులు పొందవచ్చునని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరిపాక, బంగారమ్మపాలెం గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

జిల్లా ఉద్యానవన అధికారి ఎం. ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీ పథకాలపై వివరించారు. వెటర్నరీ అధికారిని స్వర్ణలత స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ ఉద్యానవన సహాయకులు పి.అపర్ణ, శరగడం రాము, మల్ల శ్రీను, దాడి కన్నం నాయుడు, రాపేటిరాము ,రామకోటి పాల్గొన్నారు.

యలమంచిలి : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యలమంచిలి ఎడిఎ కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.మోహనరావు మాట్లాడారు. మార్కెట్ కమిటి సెక్రటరీ లక్ష్మణ్, వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.


కె.కోటపాడు : నెలాఖరులోగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఎఒ సోమశేఖర్ సూచించారు. మండలంలోని చౌడువాడ. గరుగుబిల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ కేన్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వి. రమణ మాట్లాడుతూ రైతులు చెరుకు విత్తనాల రకాలను మార్చుకోవాలన్నారు. చెరుకు రైతుల సమస్యలపై త్వరలో శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఏరుకు నాయుడు. ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్. వార్డు నెంబరు తనకల అప్పల నాయుడు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని బోని, చందక గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆశ దేవి కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. వరి పొలాల్లో సుడి దోమ, పొడ తెగులు నివారణకు తూటికాడ కషాయం తయారు చేసుకునే విధానాన్ని భీమిలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్ వివరించారు. జిల్లా ఉద్యనవన అధికారి కె.సత్యనారాయణ రెడ్డి కూరగాయలు సాగు గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి సిహెచ్.సంధ్య రత్న ప్రభ మట్టి నమూనాల ఫలితాల విశ్లేషణ గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతలను ఎన్ఎఫ్ఎ శ్రీనివాస చక్రవర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు, మజ్జివలస గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచులు సిరిగిడి సంతోషి, తుపాకుల ఆదిలక్ష్మి, వ్యవసాయ శాఖ భీమిలి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, డిఆర్‌సి ఎడిఎ చదువుల సుబ్రమణ్యం, ఎఒ బి.శివ కోమలి పాల్గొన్నారు.

డిఎస్‌పి మోహన్ బదిలీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్ బదిలీ అయ్యారు. ఆయనను ఇంటిలిజెన్స్ డీఎస్పీగా ప్రభుత్వం నియమించినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికలలో సమర్థమైన అధికారిగా పని చేసి ఉన్నతాధికారుల వద్ద పేరు తెచ్చుకున్నారు.





హాజరైన సంఘం నాయకులు

శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని వెంకన్నపాలెం సమీపంలో నీలాద్రి లేఅవుట్ గల జిల్లా కమ్యూనిటీ భవనం వద్ద నాయీ బ్రాహ్మణుల పాత్ర : సామాజిక బాధ్యత రాజకీయ ప్రాధాన్యత అనే అంశంపై రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంక కళాకారు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పేలూరి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. విజయవాడ నుండి ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు దాక్షారపు సూరిబాబు, గాజువాక నుండి రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఉండవల్లి శ్రీనివాసరావు, పసుములూరు సత్యకృష్ణ శిక్షణ నిర్వహించారు. చట్టసభల్లో గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, బాబురావు, సాధికారిక కమిటీ జిల్లా కన్వీనర్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : త్యాగాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో రక్షించుకుంటామని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలేదీక్షలు బుధవారానికి 1278వ రోజుకు చేరాయి. దీక్షల్లో మున్సిపల్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3 లక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు చేస్తున్నారన్నారు. దేశ సంపదైన ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. అదానీ, అంబానీలకు ప్లాంట్‌ను కట్టబెట్టే కుట్రలను మోడీ సర్కారు విడనాడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ లేని విశాఖ నగరాన్ని ఊహించుకోలేమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, శ్రావణ్, వై.చంద్రరావు, మచ్చా శ్రీకాంత్, దుక్కా రమణ, ఆర్.రాజకుమార్, సురేష్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

కల్యాణపులోవ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కల్యాణపులోవ (వరహా) జలాశయం ప్రస్తుతం నీటిమట్టం 458.80 అడుగులకు చేరిందని జలాశయం ఏఈ సత్యనారాయణదొర చెప్పారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపిన వివరాల మేరకు... జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 460.00 అడుగులు కాగా ప్రస్తుతం ఇన్ ఫ్లో 50 క్యూసెక్కుల వరద నీరు చేరుతుందన్నారు. గత రెండు రోజులుగా జలాశయం పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు మరింత వరద నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం సాయంత్రానికి స్పిల్ వే ద్వారా ముందుగా రెండు గేట్లు ఎత్తి 100 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోనికి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. జలాశ యం పరివాహక ప్రాంతంలో ఇన్ ఫ్లో పెరిగే కొద్ది మిగిలిన గేట్ల ద్వారా దిగువకు (నది) లోనికి వరద నీటిని విడుదల చేస్తామన్నారు. సర్పా నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న గ్రామ ప్రజలను అప్రమత్తం చేయవలసినదిగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందించామని ఏఈ సత్యనారాయణదొర పేర్కొన్నారు.


స్ప్రేయింగ్ చేస్తున్న వైద్య అధికారులు..

ముమ్మరంగా స్ప్రేయింగ్

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలంలో మేజర్ పంచాయతీలో కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారిణి రజని, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం డెంగీ వ్యాధి పై అవగాహన కల్పించడంతో పాటు ముమ్మరంగా స్ప్రే యింగ్ చేయించారు. స్థానిక పెద్ద సోఫా వీధిలో కలం రమణమ్మకు డెంగీ సోకి అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చింది. దీంతో పిహెచ్‌సి సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఇంటి పరిసరాల్లో స్ప్రేయింగ్ చేసి 100 మీటర్ల దూరంలో గల ఇంటి పరిసరాల్లో పలువురు రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి రజని పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలని, కాచి వడపోసిన నీళ్లు తాగాలన్నారు. బాధితురాలిని సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, చోడవరం టిడిపి మహిళ అధ్యక్షులు కోట నీలవేణి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపి హెచ్‌ఈవో రామారావు, హెచ్‌యస్ రమణ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న అధ్యాపకులు

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ గురుకుల కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణకు బుధవారం ఉద్యోగ విరమణ వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను సన్మానించారు ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్, స్పీకర్ అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్, గురుకుల పాఠశాలల డిసిఓ రూపవతి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, పిఆర్‌టియూ జిల్లా ప్రతినిధి గోపీనాథ్, విశ్రాంత పిడి శ్యామ్ కుమార్, పలువురు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేపట్టవద్దు

ప్రజాశక్తి -చింతపల్లి : గంజాయి సాగు, అక్రమ రవాణా, వినియోగం వంటి వాటిలో పాల్గొని యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నవరం ఎస్సైలు వీరబాబు, రమణలు సూచించారు. అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతుగెడ్డ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం గంజాయి వాడకం, సాగు, రవాణా తదితర వాటితో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27,28,29 గీతం యూనివర్సిటీ వేదికగా నిర్వహిం చనున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ టేబుల్ టెన్నిస్ ర్యాకింగ్ చాంపియన్ షిప్ గోడపత్రికను లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ విశాఖపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ జి. వరప్రసాద్, ఎల్ఐసి సేల్స్ మేనేజర్ ఎన్.జి.రవి కిరణ్, ఎల్ఐసి క్లబ్ కార్యదర్శి బి.శ్రీనివాస్, ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డ్ మెంబర్ డివిఎస్‌వై శర్మ, టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డివిజనల్ మేనేజర్, క్రీడాకారులు

పర్యాటక దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం – పీస్ థీమ్‌తో ఈ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆర్‌కె.బీచ్ రోడ్‌లో అందరి భాగస్వామ్యంతో టూరిజం వాక్ జరుగుతుందని, 9 నుంచి 12 గంటల వరకు వివిధ అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులను ఆదేశిస్తూ బుధవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. పటిష్ట ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రజలు, అధికారులు భాగస్వామ్యమై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చరిత్రహీనుడుగా ఆర్.కృష్ణయ్య

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఎంవిపీ కాలనీ: రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్.కృష్ణయ్య చరిత్ర హీనుడుగా మిగిలి పోతారని వైసిపి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మధ్యాహ్నం బీచ్ రోడ్డులోని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలకు మంచి చేస్తారనే ఉద్దేశ్యంతో మాజీ సిఎం జగన్ ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ పదవి ఇచ్చారనీ, ఇప్పుడు ఆయన చంద్రబాబుకు అమ్ముడు పోయాడన్నారు. ఆర్.కృష్ణయ్యను ప్రజలు క్షమించరన్నారు. బీసీలకు అన్యాయం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. బీసీలకు జగన్ రాజ్యసభ సీట్లు ఇస్తే వాటిని వేరే వారికి ఇవ్వాలని చంద్రబాబు చూస్తున్నారని, వాటిని అమ్ముకొనే దళారిగా


మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగేశ్వరరావు

చంద్రబాబు మారారన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తిరుపతి లడ్డుపై టీటీడీ ఈవో ఒక మాట చంద్రబాబు మరో మాట మాట్లాడుతున్నారని తెలిపారు. టీటీడీ ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా చంద్రబాబు మాట్లాడుతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ నుంచి ప్రజల దృష్టి మార్చడం కోసం చంద్రబాబు లడ్డు గురించి మాట్లాడుతున్నారు. ఈ మీడియా సమావేశంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి రెడ్డి, జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పాల్గొన్నారు.

ఐశ్వర్య డెవలపర్స్‌పై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐశ్వర్య ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ సంస్థపై కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మొద్దని సంస్థ అధినేత్రి దివ్య తెలిపారు. బుధవారం ఉదయం విశాఖలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐశ్వర్య ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ సంస్థను 2022లో ఏర్పాటు చేశామని, భోగాపురం, ఆనందపురం, తగరపువలస, అచ్యుతాపురంల్లో వెంచర్స్ వేశామని అన్నారు. వివాదానికి కారణమైన చెరుకూరి రాంజీ వివరాలను ఆమె వెల్లడించారు.

పాఠశాల అభివృద్ధికి రూ.50 వేల వితరణ

పూర్వ విద్యార్థులను అభినందించిన హెచ్‌ఎం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఒక్క తరగతి గది మరమ్మత్తు పనులు చేపట్టి, అభివృద్ధి చేసేందుకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. పాఠశాల్లో 1997లో చదువుకున్న పూర్వ విద్యార్థులు కమిడి రమణ, ఖాళీషా, ఈశ్వరరావు తదితరులు పాఠశాలలో ఒక తరగతి గది మరమ్మత్తులకయ్యే ఖర్చులకు గాను రూ.50 వేలు సమకూర్చారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణకు నగదు అందజేశారు. తరగతి గదులు శిధిలావస్థకు చేరడంతో విద్యార్థుల అవస్థలను చూసి పాఠశాలకు తమ వంతుగా సహాయం చేయాలని పూర్వ విద్యార్థులమంతా నిర్ణయం తీసుకుని, ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని పూర్వ విద్యార్థులు వెల్లడించారు. పాఠశాల తరగతిగది మరమ్మత్తు పనులు చేపట్టేందుకు సుమారుగా రూ.80 వేలు అవసరం కాగా, పూర్వ విద్యార్థులు రూ.50 వేలు సహాయం అందించగా , పాఠశాల ప్రధానోపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ తన వంతు సాయంగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, సర్పంచ్ ఫాతిమున్నీషా, ఉపాధ్యా యులు ఎన్ వి ఎస్ ఆచార్యులు ,కుమారి ,చిన్నారావు, రమేష్ దాతలకు అభినందనలు తెలియజేశారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు